క్లుప్తంగా

కమనీయం.. శివయ్య కల్యాణం



శివదేవుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల : క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం భక్తులకు నేత్రపర్వమైంది.

నీట్ ర్యాంకర్‌కు అమ్మవారి జ్ఞాపిక బహూకరణ



గంటా హేమ వైష్ణవిని సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఇటీవల నీట్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 115, జనరల్ కేటగిరీలో 89వ ర్యాంక్ సాధించిన పట్టణానికి చెందిన గంటా హేమ వైష్ణవికి ముత్యాలమ్మ ఆలయంలో ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి శేషవస్త్రం, అమ్మవారి రూపం జ్ఞాపికగా అందజేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు గంటా రామభాస్కరరావు, సురేఖ, భక్తులు పాల్గొన్నారు.

కె.కోట రెండో ఎంఈవోగా ప్రశాంత్ కుమార్

కామవరపుకోట : కామవరపుకోట మండలం రెండవ మండల విద్యాశాఖ అధికారిగా చిన్నం ప్రశాంత్ కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో రావికంపాడు, జంగారెడ్డిగూడెం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. కేతవరం, లక్కవరం, తడికలపూడి, కామవరపుకోట, ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి పదోన్నతిపై రెండవ మండల విద్యాశాఖ అధికారిగా ఇక్కడ బాధ్యతలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ద్వారకాతిరుమల ఎంఈఓగా వెంకట్రావు

ద్వారకాతిరుమల : మండల నూతన విద్యాశాఖ అధికారిగా పరసా వెంకట్రావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నల్లజర్ల మండలం పోతవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన ఎంఈఓగా పదోన్నతి పొంది, ద్వారకా తిరుమల ఎంఈఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎంఈఓ వెంకట్రావును కలసి శుభాకాంక్షలు తెలిపారు. పూలబొకేలు, శ్రీవారి చిత్రపటాన్ని అందించి ఘనంగా సత్కరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన అన్నమ్మ దెందులూరు మండలానికి బదిలీ అయ్యారు.

కుక్కునూరు ఎంఈవోగా గిరిభగవాన్‌దాస్

కుక్కునూరు : కుక్కునూరు మండల రెండవ ఎంఈవోగా గిరిభగవాన్‌దాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని అమరవరం జెడ్పీహెచ్‌ఎస్ చిరవెల్లిలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన ఆయన బదిలీల్లోగా భాగంగా ఇక్కడ రెండవ ఎంఈవోగా నియామకమైయ్యారు. కాగా ఆయన 2016 నుంచి 2018 వరకు ఇన్‌చార్జి ఎంఈవోగా కుక్కునూరులో విధులు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రెండవ ఎంఈవోను పలువురు ఉపాధ్యాయులు కలిసి అభినందనలు తెలిపారు.

స్పందనలో 16 అర్జీలు

జంగారెడ్డిగూడెం : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ అంశాలపై ప్రజలు వినతులు అందజేశారన్నారు. ఆయా వినతులు పరిశీలించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేయడం జరిగిందన్నారు. నిర్దేశించిన గడువులోగా వాటిని పరిష్కరించడంతో పాటు, పరిష్కార చర్యలను ఆన్‌లైన్ చేయాలని సూచించడం జరిగిందన్నారు. సోమవారం నాటి స్పందనలో మొత్తం 16 అర్జీలు వచ్చినట్లు ఆమె తెలిపారు.

పుట్టింటికి చేరిన కడెమ్మ



కడెమ్మ తల్లిని ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకువస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పోలవరం గ్రామస్తులు గ్రామదేవత కడెమ్మ తల్లి అమ్మవారిని గ్రామంలోకి తీసుకువచ్చారు. సోమవారం సాయంత్రం అమ్మవారిని దేవాలయం నుంచి గరగ నృత్యాలతో వాయిద్యాలతో గ్రామంలోని నడిబొడ్డుకు తీసుకువచ్చి నెలకొల్పారు. కొన్ని రోజులు గ్రామంలో ఉంచి అమ్మవారిని తిరిగి దేవాలయానికి తరలిస్తారు. అత్తింటి నుంచి పుట్టింటికి తీసుకువచ్చినట్లుగా గ్రామస్తులు భావిస్తారు. గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కొలుస్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

జగన్‌తోనే ప్రభుత్వ విద్య బలోపేతం

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- బుట్టాయగూడెంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో 186 మంది విద్యార్థులకు రూ.3 లక్షల 90 వేలు అందజేత

బుట్టాయగూడెం : కలలో సైతం ఊహించని విధంగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రభుత్వ విద్యను బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పోలవరం నియోజకవర్గస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ సీఎం జగన్‌కు చదువు, పిల్లలు అంటే అమితమైన ప్రేమ అన్నారు. కార్పొరేట్ పాఠశాలలతో పోటీపడి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న పేద విద్యార్థులే ఆణిముత్యాలు, మట్టిలో మాణిక్యాలు అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పాఠశాలల్లో 186 మంది విద్యార్థులు ఆణిముత్యాలుగా నిలవడంపై విద్యార్థులను, ఉపాధ్యాయులను బాలరాజు అభినందించారు. ప్రతిభ చూపిన టెన్త్, ఇంటర్ విద్యార్థులకు సుమారు రూ.3 లక్షల 90 వేల నగదు ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే బాలరాజు చేతుల మీదగా పంపిణీ చేశారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో టెన్త్, ఇంటర్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, కొవ్వాసి నారాయణ, జీసీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తెల్లం చిన్నారావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీ తెల్లం రమణ, జీలుగుమిల్లి జెడ్పీటీసీ మల్లం వసంతరావు, తహసీల్దార్ ఎస్ఎస్ శాంతి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈఓలు తెల్లం బాబూరావు, జలగం సురేష్, స్వరూప్, శ్రీనివాస్, బుచ్చియ్య, నరేంద్రరాయ్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రిన్సిపాల్స్, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

చింతలపూడి : విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో సోమవారం జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం హెచ్ఎం మాటూరి చక్రధరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పదవ తరగతిలో అత్యంత ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జానకిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత చదువులు చదవాలని సూచించారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు కూడా దొరకడం లేదంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసిన అభివృద్ధిని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డా.రాంబాబు నాయక్, సొసైటీ చైర్మన్ ఎ.సుబ్బారావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఎం.దిలీప్, వైఎస్సార్ సీపీ నాయకులు కె ఏలియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం : విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

కుక్కునూరులో

కుక్కునూరు : విద్యార్థులను చదువులలో మరింత ప్రోత్సహించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న అణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ నాయకుడు రావు వినోద్ పేర్కొన్నారు. సోమవారం కుక్కునూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న అణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు విద్యార్థులు విలాసాగరపు శ్రీవేణిక, పరిటాల అఖిల్, ఈదర నాగసాయి మనోహర్‌లకు మెడల్స్ అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మల్లేల చంటినాయుడు, సూర్ల రాము, పగిళ్ల అల్లేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో

కామవరపుకోట : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పేద విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్య అందుతుందని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్ అన్నారు. సోమవారం కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి, రెండు, మూడు స్థానాలు సాధించిన విద్యార్థులు ఎం.కృష్ణ ప్రియాంక రాణి, వి.యామిని, ఎం.పూజశ్రీలకు మెడల్స్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో విద్యార్థులకు అనేక పథకాలు అందిస్తున్నారని, విద్యార్థులు సద్వినియోపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

కామవరపుకోట : విద్యార్థి శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. సోమవారం మండలంలో తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. అలాగే పాఠశాలలో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన కె.పార్థసారథి, స్టీఫెన్ జయ, చైతన్య లక్ష్మికి మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కడిమి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేలాది కోట్లు ఖర్చుతో జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, ఆణిముత్యాలు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల శ్రేయస్సుకు అహర్నిశలూ కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగపరుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో చింతలపూడి మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు ఏ.సర్వేశ్వరరావు, సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపీటీసీలు గంగుల కడియాలు, కొప్పర్తి లక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చింతలపూడి : జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లు అందచేస్తున్న దృశ్యం



కామవరపుకోట : విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ రమేష్



కుక్కునూరు : ఉత్తమ విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం



కామవరపుకోట : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెడల్స్ ప్రశంసా పత్రం అందిస్తున్న పండు జగదీష్

అగ్నిప్రమాద బాధితులకు సాయం

కుక్కునూరు : మండలంలోని ఇటీవల ఇబ్రహీంపేట గ్రామంలో ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో ఐదు పూరిళ్లు దగ్ధమైన ఘటనలో నిరాశ్రయులైన బాధితులకు సోమవారం తపన ఫౌండేషన్ తరపున సాయాన్ని అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీగారామాంజనేయచౌదరి బాధితులకు పంపిన రూ.30 వేలు విలువ చేసే గ్యాస్ పొయ్యి, సిమెంట్ రేకులు, ఇతర నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కుక్కునూరు మండల బీజేపీ అధ్యక్షుడు తూము వెంకటేశ్వరావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కుంజా నరసయ్య, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే అధిక ప్రాధాన్యత

బుట్టాయగూడెం : అధికారంలోకి వచ్చిన రోజు నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నవరత్న పథకాల్లో భాగంగా పింఛన్లు, జగనన్న తోడు, జగనన్న కాలనీలు, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలిచారని అన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో ఉన్నత విద్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.కృష్ణప్రసాద్, తహసీల్దార్ సుందర్ సింగ్, ఎస్సై చంద్రశేఖర్, జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్స పోచమ్మ, వైస్ ఎంపీపీ సోమగాని శ్రీను, సర్పంచ్ బోడిక భోగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి, గంటశాల గాంధీ, ఉప పర్పంచ్ దొడ్డకుల సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ గూడవల్లి శ్రీనివాపరావు, జేసీఎస్ చైర్మన్ వనమా రామకృష్ణ, నాయకులు చందా ప్రసాద్, చిట్టిబొమ్మ శ్రీను, బి. ప్రేమ్‌కుమార్, కె.రాము, కె.చక్రి, ఉప్పల రాంపండు, శ్రీపతి సాయి, సిరిబత్తుల భాస్కర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కామయ్యపాలెంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

నెక్లెస్‌బండ్ పనుల పరిశీలన

పోలవరం రూరల్ : పోలవరంలో వరద నుంచి రక్షణగా చేపట్టిన నెక్లెస్‌బండ్(మట్టికట్ట) పటిష్ట పరిచే పనులను అధికారులు సోమవారం పరిశీలించారు. గ్రామస్తులు నదికి వెళ్లి వచ్చేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అధికారులకు సూచించారు. నిత్యం రజకులు, జాలర్లు గోదావరి నదికి వెళుతుంటారని తెలిపారు. గ్రామస్తులు ఎవరైనా మృతిచెందితే దహన సంస్కారాలకు గోదావరి నది ఒడ్డుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కార్తీకమాసంలో గోదావరి నది స్నానానికి కూడా గ్రామస్తులు వెళతారని, నదికి వెళ్లి వచ్చేందుకు వీలుగా గట్టు ఎక్కిదిగేందుకు ర్యాంపులు ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ పి.వెంకటరమణ, తహసీల్దార్ బి.సుమతి, ప్రాజెక్టు డీఈ వెంకటేశ్వర్లు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రెయిన్ సమస్యల తొలగింపునకు చర్యలు

జంగారెడ్డిగూడెం : రానున్న రోజుల్లో డ్రెయిన్ సమస్యలు తొలగించేలా చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం ఊర చెరువు సమీపంలో నిర్మిస్తున్న డ్రెయిన్ పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఊర చెరువు వద్ద దశాబ్దాల కాలం నుంచి మురుగునీరు పోవడానికి సరైన దారి లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో విషయాన్ని ఎంపీ కోటగిరి శ్రీధర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఆయన ఎంపీ లాడ్స్ నుంచి మంజూరు చేసిన రూ.30 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ క్రమంలో డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలించేందుకు వచ్చినట్లు ఆమె తెలిపారు. గుత్తేదారునికి నాణ్యతతో డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని సూచించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో డ్రెయిన్ సమస్యలు ఉండవని, సీసీ రోడ్లు కూడా నిర్మిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నగరాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రగతిపథంలో ముందుకు వెళుతుందన్నారు. కాగా పట్టణంలో చేపడుతున్న రూ.30 లక్షలతో ఊర చెరువు డ్రెయిన్, రూ.9 లక్షలతో 2వ వార్డు కొంగలకట్ట, రూ.7 లక్షలతో ఉప్పలమెట్ట డ్రెయిన్ నిర్మాణాలు చివరి దశలో ఉన్నట్లు ఆమె వివరించారు. చైర్‌పర్సన్ వెంట కౌన్సిలర్లు చిటికెన అచ్యుత రామయ్య, దొంతు మాధవ్, సంకు సురేష్, బత్తిన చిన్న, కంచర్ల విష్ణు, కమిషనర్ పి.భవానీప్రసాద్, ఏఈ సంధ్య, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



ఊర చెరువు వద్ద డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జగనన్న సురక్ష పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

కొయ్యలగూడెం : జగనన్న సురక్ష పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత చేరువచేయాలని ఎంపీపీ గంజిమాల రామారావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో జగనన్న సురక్ష పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జూలై నాలుగో తారీఖు నుంచి సచివాలయంలో జగనన్న సురక్ష పథకం ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ మట్ట వనజ లక్ష్మి, ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల తీరుపై అసంతృప్తి

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తూ ప్రజలలోకి తీసుకు వెళ్లాల్సిన పథకాల తీరు తెన్నుల గురించి నిర్వహిస్తున్న సమావేశంపై సమాచారం ఉండడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ నిబంధనలు సైతం అమలు చేయడం లేదని అన్నారు. ముఖ్యంగా మీడియాకి సమాచారం ఇవ్వకపోవడం పట్ల మండల పరిషత్ అధికారులను నిలదీశారు. సమావేశ విషయాన్ని మీడియా సభ్యులకు తెలపాల్సిందిగా ముందుగానే సూచించినప్పటికీ అమలు చేయకపోవడంపై, గుట్టు చప్పుడు కాకుండా సమావేశాన్ని ముగించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గంజిమాల రామారావు

అమ్మవార్లకు పూజలు

కొయ్యలగూడెం : ఆషాడ మాసం ప్రారంభం కావడంతో సోమవారం అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ దేవతల ఆలయాలతో పాటు పొలిమేర ఆలయాలలో కొలువైన అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొయ్యలగూడెం సమీపంలోని నేషనల్ హైవే పక్కన స్వయంభుగా కొలువైన శ్రీనీలాలమ్మ అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

శంకుస్థాపన

చింతలపూడి : ప్రగడవరం పంచాయతీ, దేశవరం గ్రామంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులను మంజూరు చేశారు. సర్పంచ్ టి భూపతి, ఉప సర్పంచ్ రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ నాగలక్ష్మిల ఆధ్వర్యంలో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు.

ఉపాధి కూలీల చేయూత

ద్వారకాతిరుమల: తిమ్మాపురం గ్రామంలో ఉపాధి కూలీలు షేక్ మీరావలి, ఉండి కృష్ణ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాలకు తోటి కూలీలు సోమవారం చేయూతనిచ్చారు. 12 బియ్యం బస్తాలు (ఒకొక్కటి 25 కేజీలు), అలాగే 5 కేజీల పంచదారను అందజేశారు.

చంద్రబాబు, పవన్‌లకు క్లారిటీ లేదు

కొయ్యలగూడెం : నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లను మానసిక వైద్యుల వద్దకు పంపాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు సూచించారు. సోమవారం కిచ్చప్పగూడెం గ్రామంలో ప్రారంభించిన జగనన్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి పార్టీ నాయకులతో కలిసి హాజరైన ఆయన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పొంతన లేని మాటలతో ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ఓవైపు 175 స్థానాలు మనమే గెలవాలి అంటూ చంద్రబాబు అంటే, మరోవైపు టీడీపీతో పొత్తు పెట్టుకుంటాం, సగం సీట్లలో పోటీ చేస్తామంటూ జనసైనికుల్ని పవన్ అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. బహుశా తెలంగాణ రాష్ట్రాన్ని కూడా కలుపుకుని మాట్లాడారేమో అంటూ ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు ఒక క్లారిటీ గాని, దిశా నిర్దేశం గాని, లక్ష్యం గాని లేవన్నారు. మొన్నటి వరకు అనుభవ రాహిత్యం ఉన్న తనకంటే అనుభవం ఉన్న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండడం మంచిది అన్న పవన్‌కళ్యాణ్ 15 రోజుల గడవకుండానే నేనే ముఖ్యమంత్రిని, నన్నే గెలిపించండి అంటూ ప్రాధేయపడుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే వచ్చే ఎన్నికలలో తమ బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. గిరిజన గ్రామాలు వచ్చే ఎన్నికలలో ఏకపక్ష తీర్పునివ్వబోతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల ఎస్టీ సెల్ కన్వీనర్ కురసం మురళి పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దూలపల్లి కాంతారావు, నూనె నాగు, కన్నయ్య, గిద్దే సూర్యచంద్రరావు, ఎస్‌కే నాగూర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పార్టీ నాగేశ్వరరావు, పార్టీ నేతలు

భద్రతా నియమాలపై అవగాహన

కామవరపుకోట : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని యూనియన్ డివిజన్ కార్యవర్గ సభ్యులు ఏడీఈ పి.రాధాకృష్ణ అన్నారు. సోమవారం మండలంలో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో చింతలపూడి సబ్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులకు భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది భద్రత నియమాలను పాటించడంలో ఆలసత్వం తగదని, వర్షాకాలం సమీపించడంతో సిబ్బంది ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ తమ ప్రాణాలను కాపాడుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో కామవరపుకోట ఏడీఈ శ్రీనివాస్, చింతలపూడి ఏడీఈ రాంబాబు నాయక్, మూడు మండలాల ఏఈలు, కామవరపుకోట విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేయాలి

కొయ్యలగూడెం : పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని సత్వరమే ప్రాజెక్టును పూర్తిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణం, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాతా సోమవారం కొయ్యలగూడెం మండలంలోకి ప్రవేశించింది. కొత్తూరు, కొయ్యలగూడెం పట్టణంలో ప్రజలను కలిసి కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీపు జాతాలో సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కే బాజీ, నాయకులు మట్టా రామకృష్ణ, ఎస్ గిరి, వెలగల రామారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మకు జలాభిషేకం

జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ అమ్మవారికి సోమవారం జలాభిషేకం నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అమ్మవారి ధృవమూర్తికి జలాభిషేకం జరిపారు. తొలుత ఆలయంలో గణపతిపూజ, అనంతరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు మిర్తిపాటి శ్రీనివాస్, మేడూరి విశ్వేశ్వరశర్మ వేదమంత్రోచ్ఛారణ నడుమ ముత్తైదువులతో కలశాలలో జలాలను తీసుకువచ్చి అమ్మవారిని అభిషేకించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ బత్తిన నాగలక్ష్మి పాల్గొని ప్రారంభించారు. ఆలయ నిర్మాణకర్త మురళీకృష్ణ మాట్లాడుతూ లోకకల్యాణార్థం, వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురిసి పాడిపంటలతో వర్ధిల్లాలనే సత్సంకల్పంతో జలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు.

అన్నసమారాధన

కొయ్యలగూడెం : పులి వాగు శివాలయంగా పిలవబడే శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రతి సోమవారం మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు మణికంఠ శర్మ పేర్కొన్నారు. బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన బాలంరత్నాజీ, రమాదేవి దంపతుల సౌజన్యంతో సోమవారం ఆలయం వద్ద 1,500 మందికి పైగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వర పూజలతో పాటు కాలభైరవ, హనుమద్ పూజలు నిర్వహించారు. భక్తుల ద్రవ్యసహాయాలతో అన్నదానం నిర్వహిస్తామని, దాతలు వారం రోజులు ముందుగా ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు.